క్లుప్తంగా

జీడీనెల్లూరు ఇన్‌చార్జ్ సీఐగా శ్రీనివాసంతి



గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు ఇన్‌చార్జ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసంతి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ రికార్డ్ బ్యూరోలో పనిచేస్తున్న శ్రీనివాసంతి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను వీఆర్‌కు బదిలీ చేశారు.

దివ్యాంగులపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పద్మావతి

వదమాలపేట(విజయపురం): తల్లిదండ్రులు దివ్యాంగులపై శ్రద్ధ చూపాలని వడమాలపేట ఎంఈఓ పద్మావతి తెలియజేశారు. వడమాలపేట మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఎన్నో సౌకర్యాలు, సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వీరిని కూడా క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలను నిర్వహించి విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు. ఎంఈఓ-2 తులసీరామ్, హెచ్‌ఎం దినకుమార్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు హేమలత, విజయకుమారి, ఫిజియోథెరపిస్ట్ నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా విద్యా బోధన



బోధనా అభ్యసన కృత్యాల మెటీరియల్‌ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. మంగళవారం ఎమ్మార్సీ భవనంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు టీఏఆర్‌ఎల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు, విద్యాస్థాయి అభివృద్ధి చేయడానికి టీఏఆర్‌ఎల్ కార్యక్రమం తోడ్పడుతుందని తెలిపారు. బోధనా అభ్యసన కృత్యాల మెటీరియల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, కోదండయ్య, చంద్రశేఖర్, జీపీ శెల్వ, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలాజీ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: తడుకు పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాలాజీ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామానికి వెళ్లి బాలాజీ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం బాలాజీ చేసిన సేవలు మరువలేమన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, పార్టీ నాయకులు గూళూరు కరుణ, అన్నా లోకనాథం, మస్తాన్, శరవణ, శివయ్య, కళ్యాణ్, పుష్పరాజ్, జైకుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం బీకాం జనరల్ చదువుతున్న విద్యార్థి ఎస్.వినోద్ హైజంప్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ ఈవెంట్‌లో తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం ఇన్‌చార్జి డి.భాస్కర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ఎం.రెడ్డినాయక్, ఫిజికల్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొట్రకోన రోడ్డు



జీడీ నెల్లూరు వంతెనపై గుంతలు, ప్రమాదాలు జరిగే ప్రదేశం

ప్రయాణం.. నరకప్రాయం

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


గంగాధరనెల్లూరు: రోడ్లు గుంతలమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మండలం కేంద్రం నలుమూలల నుండి తూగుండ్రం రోడ్డు, కోట్రకోన రోడ్డు, ఎస్‌ఎస్ కొండ రోడ్డుపై ఎటుచూసినా గుంతలమయంగా ఉన్నాయి. మండలంలోని తూగుండ్రం పాల డెయిరీ నుంచి పిళ్లారి కుప్పం గ్రామం రోడ్డు వరకు గుంతలుగా ఉంది. జీడీనెల్లూరు మండల ఆఫీసుకు, ఇటుపక్క మండలమైన పాలసముద్రం మండలానికి ప్రధాన రహదారి ఇదే. తూగుండ్రం ఒక వాణిజ్య సముదాయం. చుట్టుపక్కల గ్రామాలను వివిధ పనుల నిమిత్తం మండల హెడ్ క్వార్టర్‌కి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నడవాలంటే నరకప్రాయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలు, బస్సులు లేక ఆటోలపై ఎక్కువమంది వెళ్తూ ఉంటారు. ద్విచక్ర వాహనదారులైతే అత్యవసర సమయంలో పట్టణానికి వెళ్లాలంటే ఈ గుంతల్లో పడి అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలు, గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మిగతా వాహనాలు పరిస్థితి అంతే. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదంలో వంతెన

జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని నీవా నది వంతెనపై ఒకవైపు గోడ కూలిపోగా వంతెన ప్రారంభంలో పెద్ద గుంత పడిపోయింది. చిత్తూరు వైపు నుండి జీడీ నెల్లూరు వస్తున్న ప్రతి ఒక్కరు ఆ గుంత వద్ద ఆగి పడిపోయిన గోడ వైపు వస్తుండడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మండలంలో నెల్లేపల్లి రహదారిపై కూడా ఇలానే ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంపై ఎన్నో అభాండాలు మోపి అధికారాన్ని చేపట్టిన కూటమి నాయకులు ఆదాయ మార్గాల వైపు చూస్తున్నారు. అంతే తప్ప సామాన్య ప్రజలకు రోడ్లు ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టకపోవడం విచారకరం. ఇదే రోడ్లపై ఎందరో ప్రజాప్రతినిధులు ప్రతినిత్యం తమ పనులు చూసుకోవడానికి రాకపోకలు సాగిస్తున్నారు. అయినా రోడ్లను మెరుగుపరిచే చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి సంకేతం.

స్తంభించిన రాకపోకలు

గంగాధరనెల్లూరు మండల పరిధిలోని కలిజవేడు గ్రామ సమీపంలో నీవా నదిపై ఉన్న ఎన్టీఆర్ జలాశయం గేట్లు ఎత్తడంతో నీరు భారీగా ప్రవహిస్తోంది. దీంతో నీవా నది పరివాహక ప్రాంతాలైన కలిజవేడు, నందనూరు తదితర పంచాయతీలకు రాకపోకలు స్తంభించాయి. ఈ గ్రామాలవారు చిత్తూరు పట్టణానికి వెళ్లడానికి వేరే మార్గం లేకపోవడంతో దాదాపు 20 కిలో మీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో నీవానదిపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నీవా నది ప్రవాహానికి కొట్టుకుపోయిన కలిజవేడు రోడ్డు



ఛిద్రమైన జీడీనెల్లూరు-పాలసముద్రం హైవే



బొమ్మవారిపల్లి రోడ్డు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ఆశ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చక్రపాణి

వదమాలపేట(విజయపురం): గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే బిడ్డలు ఆరోగ్యంగా పుడతారని పీహెచ్‌సీ డాక్టర్ చక్రపాణి అన్నారు. మంగళవారం వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులు, బాలింతలపై ఆశ వర్కర్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం రోజు వరకు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన బంగారెడ్డికండ్రిగ



వీధిలో నిలిచిన ఉన్న వర్షపు నీరు

వదమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం, బంగారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీలో వర్షపు నీరు ముందుకు కదలడం లేదు. ఫెంగల్ తుపాన్ కారణంగా మూడు రోజులపాటు కురిసిన వర్షానికి ఎస్సీ కాలనీ నీట మునిగింది. వర్షపు నీరు వెళ్లడానికి దారి లేక పోవడంతో ఇళ్లలోకి చేరింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట ఆరు బయట అడుగు వేయడానికి భయపడుతున్నారు. ఉన్న లైట్లు మరమ్మతులకు గురికావడంతో చీకటిమయంగా మారింది. అధికారులు వర్షపు నీరు బయటకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని, అలాగే వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రామాల్లో దోమల నివారణే ముఖ్యం



ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా వారిటి నివారించడమే లక్ష్యంగా ఆశా వర్కర్లు పని చేయాలని వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నిల్ల ప్రదేశాల్లో డీడీటీ రసాయనిక ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ నివారించాలంటే ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కాచి వడపోసిన నీరు, వేడిగా ఆహారం తీసుకోవాలన్నారు. 15-18 సంవత్సరాల వయసు కలిగిన వారికి వ్యాక్సిన్ వేయాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసినవారిని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

శ్రీరంగరాజపురం: మండలంలోని పాతపాళ్యం దళితవాడలో బీఆర్. అంబేడ్కర్ విగ్రహానిన ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జిల్లా దళితుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు దామోదరం అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయకుంటే ఉద్యమాలు తప్పవన్నారు. దళిత నేతలు నాగరాజు, రఘు, దాసరి సతీష్, గురునాథం, జీవన్, యాకుబ్, శేషాద్రి, మను, కన్నయ్య, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విభిన్న ప్రతిభావంతులతో ఆర్డీఓ

నగరి: విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు సాధించాలని ఆర్డీఓ భవానిశంకరి అన్నారు. మంగళవారం 65వ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని వెలుగు సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగుల ఎదుగుదలను ప్రోత్సహించడమే ఈ దినోత్సవం ఉద్దేశమన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. వారికి ఊతమివ్వడానికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఎంఈఓ శ్రీదేవి, సీడీపీఓ కృష్ణవేణి, హౌసింగ్ ఏఈ భాస్కర్, డీటీ మేఘవర్ణం, నగరి దివ్యాంగుల సంక్షేమ సంఘ మండల నాయకులు టీఎం కేశవన్, ఆర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంపీడీఓ రమేష్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగుల తల్లిదండ్రులు తమ పిల్లలపై నమ్మకాన్ని ఉంచి, వారి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతూ భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరాలన్నారు. భవిత కేంద్రాలు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, ఐఈఆర్పీలు సూర్యకుమారి, అనంద్, జగదీశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, టీచర్స్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు తెగిన రోడ్లు



వర్షాలకు తెగిన కల్వర్టు

గంగాధరనెల్లూరు: భారీ వర్షాలకు మండలంలోని వంకలు రోడ్లు తెగి రాకపోకలకు ఆటంకం కలిగింది. మండలంలోని బాలగంగానపల్లి పంచాయతీలోని ఆరవ చేనుపల్లి గొల్లపల్లి మధ్యగల వంక దారి తెగిపోయింది. కొత్త వెంకటాపురం పంచాయతీలో కల్వర్టు తెగిపోవడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కాపు సంఘ అధ్యక్షుడిగా బాబు



నగరి: నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడిగా ఎంవి. బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం జాతీయ కాపు సంఘ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు నుంచి ఉత్తర్వులు అందాయి. జాతీయ కాపుసంఘ ప్రచార కార్యదర్శి గోపీరాయల్, స్థానిక కాపుసంఘ నాయకులు దుశ్శాలువాలతో ఆయనను సత్కరించారు.

ఉధృతంగా వాగులు



నీటి మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జీఎంఆర్ పురం, కమ్మకండ్రిగ, పాతపాల్యం కల్వర్టు వరదలో కొట్టుకుపోయింది. డీ.కే.మర్రిపల్లి, ఎగువ కమ్మకండ్రిక, పుల్లూరు గ్రామంలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కాలువల కారణంగా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

స్తంభించిన రాకపోకలు



మహదేవపురం వంకలో ప్రవాహ ఉధృతి

పాలసముద్రం: ఫెంగల్ తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో రాకపోకలు స్తంభించాయి. మహదేవపురం, వెంగళరాజుకుప్పం, మఠవలం వంకలో ప్రవాహం ఉధృతం కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిత్తూరు నుంచి బలిజకండ్రిగకు వస్తున్న బస్సులు వంకను దాటలేక కన్నికాపురం నుంచి తిరిగి చిత్తూరుకి వెళ్లిపోయాయి. ఉదయం నుంచి 11 గంటల వరకు నీరు తగ్గకుండా ప్రవహించింది. ప్రజలు చిత్తూరు, అమ్మవారి కుప్పానికి అన్నిపక్కలా వంకలో నీరు ఎక్కువగా ప్రహిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

మండలంలో మహదేవపురం వంకలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడానికి ఆక్రమణలు కూడా ఓ కారణంగా తెలుస్తోంది. కన్నికాపురం నుంచి మహదేవపురం వరకు వర్షపు నీరు వస్తున్న కాలువను కొంతమంది రైతులు అక్రమంగా ఆక్రమించుకుని చెట్లు పెట్టారు. కాలువ వెడల్పు చిన్నదైపోయి వర్షపు నీరు పోవడానికి వీలుకాని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువ ఆక్రమణలు తొలగించాల్సి ఉంది.



వెంగళరాజుకుప్పం సమీపంలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

వర్షం ఆగింది.. నష్టం మిగిలింది

- మూడు రోజులపాటు ఎడతెరపి లేని వాన
- డ్యాం గేట్లు తెరవడంతో కుశస్థలి ఉధృతం
- వంట పొలాలపై నిలిచిన వర్షపు నీరు
- మునిగిన పంటలను చూసి లబోదిబోమంటున్న రైతులు
- బురద నీటితో ఛిద్రమైన రోడ్లు



కుశస్థలి నదిలో ప్రవాహ ఉధృతి

నగరి: మూడు రోజుల ముందు ప్రారంభమై మంగళవారం ఉదయం 5 గంటల వరకు తన ప్రతాపం చూపిన ఫెంగల్ తుపాను శాంతించింది. అయితే ఎడతెరిపి లేకుండా కురిసిన ఈ వర్షం రైతులకు కష్టాలు, నష్టాలు మిగిల్చింది. పంట పొలాలపై నిలిచిన నీరు చెరువులను తలపించింది. మండలంలోని కృష్ణారామాపురం గ్రామంలో కోతకు వచ్చిన వరిపంట నీట మునిగింది. కొంతవరకు కోతకోసిన పొలాల్లో వేసిన చెరకు వర్షార్పణమైంది. చెరకు నాటిన పొలాలు, జొన్న, వరి, పూలతోటలు, కూరగాయల తోటలు గాలులకు నేలవాలి వర్షపునీట మునిగాయి. వేరుశనగ 40 ఎకరాలు, వరి 25 ఎకరాలు, 10 ఎకరాల్లో కూరగాయల తోటలు, 5 ఎకరాల్లో పూలతోటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

కుశస్థలి ఉధృతి

వర్షానికి కృష్ణాపురం డ్యాం నిండడంతో సోమవారం అర్ధరాత్రి గేట్లు తెరిచారు. దీంతో కుశస్థలి నది నీటితో పొంగి పొరలింది. కుశస్థలి నది లోతట్టు వంతెన పైనుంచి నీరు వేగంగా పారడంతో ఆ వైపు రాకపోకలను ఆపేశారు. ముళ్లకంపలను, ట్రాక్టర్లను వంతెనకు అడ్డంగా ఉంచి ఎవరూ ఆ వైపు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టారు. కుశస్థలిలో ప్రవహించే నీటిని చూడడానికి జనం ఆసక్తి చూపారు.

కొట్టుకుపోయిన వ్యక్తి.. రక్షించిన పోలీసులు

పచ్చికాపల్లంకు చెందిన చిరంజీవి అనే వ్యక్తి పోలీసుల కళ్లుగప్పి నదిలో పారుతున్న నీటిలో చేపలు పట్టడానికి దిగాడు. నదిలో నీటి వేగం అధికంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. ముళ్లకంపల మధ్య చిక్కుకున్న ఆ వ్యక్తిని పోలీసులు, స్థానిక యువకులు శ్రమకోర్చి తాళ్ల సాయంతో బయటకు లాగారు.

బురద నీటితో ఛిద్రం

వర్షాలకు మట్టిరోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాళ్లులేచి గుంతలుగా మారాయి. వర్షపు నీరు నిల్వ ఉండడమే కాకుండా ప్రయాణికులు దారిలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ నివాసాలకు వెళ్లే మార్గం ఇలా మారడంతో విద్యార్థులు పాఠశాలలకు అతికష్టం మీద ఈ మార్గంలో వెళ్లాల్సి వచ్చింది. కీళపట్టు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని హైవే మలుపు వద్ద తారురోడ్డు లేచిపోయి గుంతలమయమైంది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో గుంటలుగా దర్శనమిచ్చాయి.



నీటిలో కొట్టుకుపోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



వ్యక్తిని బయటకు లాగుతున్న పోలీసులు